# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-02-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఢిల్లీ వెళ్లనున్నారు. పలువురు కేంద్ర మంత్రులు, భారతీయ జనతా పార్టీ నేతలతో ఆయన సమావేశమవుతారు**
2. **ప్రకాశం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపుతామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు.**
3. **అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.**
4. **యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర క్రీడా పాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు సూచించారు.**
5. **శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు ఈ రోజు ప్రారంభమయ్యాయి.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఢిల్లీ చేరుకుంటారు. రాత్రికి పలువురు కేంద్ర మంత్రులు, భారతీయ జనతా పార్టీ నేతలతో సమావేశమవుతారు. రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులపై ధన్యవాదాలు తెలుపుతారు. రేపు ఎన్డీయే తరపున ఢిల్లీ శాసనసభ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.

--------------------------

ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను విదేశీనిపుణులు, కేంద్ర జలసంఘం అధికారులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులు నిన్న పరిశీలించారు. ఈ రోజు, రేపు జరిగే సమావేశంలో చర్చించే అంశాలకు సంబంధించిన ఎజెండా రూపకల్పన, అవసరమైన నివేదికలపై ప్రాథమికంగా చర్చించారు. బ్యాచింగ్ ప్లాంటు, ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్స్, యంత్ర సామగ్రి, మెటీరియల్ సంసిద్ధత తదితర అన్ని అంశాలనూ పర్యవేక్షించారు. ఈ రోజు జరిగే సమావేశంలో నిర్మాణ పనులు, నాణ్యత పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. మరోవైపు.. పోలవరం ప్రాజెక్టు అథారిటీ చీఫ్ ఇంజనీరుగా ఎం.రమేశ్ కుమార్ నియమితులయ్యారు.

---------------------------

ప్రకాశం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా 56వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు ఉదయం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో మంత్రి జిల్లా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయకుమార్‌తో కలిసి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి బాలవీరాంజనేయస్వామి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా ఏర్పడి 56 సంవత్సరాలు అయినా ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి అయితే జిల్లాలో అభివృద్ధికి అడుగులు పడతాయని మంత్రి వివరిస్తూ...

...వాయిస్...20 సెకన్లు

---------------------------

ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులు జేఈఈలో రాణించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా తొలుత గుంటూరు, అనంతపురం జిల్లాల్లోని 29 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఎంపిక చేశారు. వాటిలోని 1,800 మంది విద్యార్థులకు చెన్నైలోని ఐఐటీ ప్రొఫెసర్లతో ఆన్‌లైన్ క్లాసులు చెప్పిస్తున్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి స్థానిక అధ్యాపకుల పర్యవేక్షణలో నిత్యం ఈ తరగతులు జరుగుతున్నాయి. ఈ కోచింగ్‌కు 'విద్యాశక్తి'గా నామకరణం చేశారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యార్థులకు జేఈఈ సిలబస్‌ను బోధిస్తున్నారు.

---------------------------

అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నిన్న సాయంత్రం మీనోత్సవం నిర్వహించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండ్లకమ్మ రిజర్వాయర్ లో 20 లక్షల 65వేల చేప పిల్లలను వదిలిపెట్టారు. అనంతరం మంత్రి రవికుమార్ విలేకరులతో మాట్లాడుతూ, 90వేల ఎకరాలకు సాగునీరు, ఒంగోలు,అద్దంకి, చీమకుర్తి ప్రాంతాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ముంపు గ్రామాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని రవికుమార్ వివరిస్తూ...

...వాయిస్...20. సెకన్లు

---------------------------

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు ఈ రోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఏటా ఒక్కరోజు మాత్రమే ఇక్కడ ఉత్సవాలు జరిగేవి. కూటమి అధికారంలోకి వచ్చాక అరసవల్లిలో రథసప్తమిని రాష్ట్ర పండగగా జరపాలని ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో తొలిసారిగా అరసవల్లిలో 3 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. మొదటి రోజు సుమారు 3 వేల మందితో సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఈ రోజు, రేపు హెలికాప్టర్ రైడ్, గ్రామీణ క్రీడా పోటీలు, లేజర్ షో, వివిధ

సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రేపు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 4వ తేదీ ఉదయం 8 గంటల వరకూ ఆదిత్యుడికి మహాక్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

---------------------------

వసంత పంచమి వేడుకల సందర్భంగా ఈ రోజు శ్రీశైల దేవస్థానం తరపున శ్రీ కొలను భారతీ దేవికి నందికొట్కూరు శాసనసభ్యులు జి.జయసూర్య పట్టు వస్త్రాలు అందజేశారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం శివపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ కొలను భారతి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా ప్రారంభ మయ్యాయి. మూలా నక్షత్రంలో  క్షేత్రంలో జరుగుతున్న అమ్మవారి జన్మదిన వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

---------------------------

యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర క్రీడా పాధికార సంస్థ.. శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు. ఈ రోజు అనంతపురం పట్టణంలో ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో " సే నో టూ డ్రగ్స్" నినాదంతో నిర్వహించిన 10 కిలోమీటర్ల పరుగును.. అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఆహుడా చైర్మన్ టీసీ వరుణ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు క్రీడలు దోహదపడుతాయని అన్నారు. అనంతపురం జిల్లాను క్రీడా హబ్ గా మారుస్తామని శాప్ ఛైర్మన్ తెలియజేస్తూ..

...వాయిస్ ...  37 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు వసతులు కల్పిస్తున్నామని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని శ్రీకుమార భీమేశ్వరాలయాన్ని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. భీమేశ్వరాలయం వద్ద భక్తులకు సరైన వసతులు లేవని తెలిపారు. స్థానికంగా రిసార్ట్స్ ఏర్పాటుచేసి కాకినాడ బీచ్, ఇతర ప్రముఖ ప్రదేశాలను సందర్శించుకునేలా పర్యాటక ప్రణాళికను రూపొందించామని వెల్లడించారు. కాకినాడ బీచ్‌తో పాటు ఇతర బీచ్‌లను విశాఖపట్నం తరహాలో తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

=====================